

వర్షం కురిసింది.. లోటు తీరింది



- జిల్లాలో చెరువులు, కుంటలకు జల కళ
- జోరందుకున్న వ్యవసాయ పనులు
- లక్ష ఎకరాలు దాటిన వరి నాట్లు
- కూలీలకు చేతి నిండా పని

జగిత్యాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా కరువు తీరా వాన కురిసింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే సగటున సుమారు 27.0 శాతం అధిక వర్షపాతం నమోదైంది. వానాకాలం సీజన్ ప్రారంభమైన నెల రోజులు అంతంత మాత్రంగానే కురిసిన వర్షాలు సుమారు వారం రోజులుగా దంచికొడుతున్నాయి. దీంతో పంటలకు ఉపశమనం కలగడమే కాకుండా చెరువులు, కుంటలు, ఇతర జలాశయాలు నిండుకుండలా కనిపిస్తున్నాయి. ముసురుతో కూడిన వర్షాలు కురుస్తుండడం వల్ల భారీ వరదలు లేకుండా కొద్ది కొద్దిగా నీరు జలాశయాల్లోకి చేరుతోంది.

వారం రోజులుగా వానలే వానలు..

నైరుతిరుతుపవనాల ప్రభావంతో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వర్షాలు కురుస్తుంటాయి. జూలై మొదటి వారం వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ రికార్డు అయింది. జిల్లాలో జూన్ నెలాఖరు వరకు 164.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 200.8 మిల్లీ మీటర్లు నమోదైంది. అంటే సాధారణం కంటే సుమారు 36 శాతం ఎక్కువ వర్షపాతం రికార్డు అయింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సాధారణం నుంచి అత్యధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం. జూలైలో ఇప్పటివరకు సాధారణం కంటే 35 శాతం అధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలో జూలై మాసంలో ఇప్పటివరకు సాధా రణంగా 392.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 528.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణంగా కురవాల్సిన వర్షం కంటే 20 శాతం నుంచి 35 శాతం తక్కువ వర్షపాతం నమోదైతే లోటు వర్షపాతంగా వాతావరణ శాఖ భావిస్తుంది. అలాగే కురవాల్సిన వర్షం కంటే 20 నుంచి 59 శాతం వరకు ఎక్కువ వర్షపాతం నమోదైతే అధిక వర్షపాతంగా లెక్కిస్తారు. 60 శాతానికి మించి ఉంటే అత్యధిక వర్షపాతంగా పరిగణిస్తారు.

తొమ్మిది మండలాల్లో అధికం.. అయిదు మండలాల్లో అత్యధికం...

జిల్లాలోని తొమ్మిది మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. ఇబ్రహీంపట్నంలో 44.0 శాతం, జగిత్యాలలో 31.0 శాతం, కోరుట్లలో 40.0 శాతం, మెట్‌పల్లిలో 39.0 శాతం, కథలాపూర్‌లో 34.0 శాతం, మల్యాలలో 59.0 శాతం, పెగడపల్లిలో 45.0 శాతం, భీమారంలో 53.0 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. అదేవిధంగా మల్లాపూర్‌లో 86.0 శాతం, రాయికల్‌లో 76.0 శాతం, సారంగపూర్‌లో 69.0 శాతం, మేడిపల్లిలో 62.0 శాతం, కొడిమ్యాలలో 72.0 శాతం అత్యధిక వర్షపాతం నమోదైంది. బీర్‌పూర్, ధర్మపురి, బుగ్గారం, జగిత్యాల రూరల్, గొల్లపల్లి, వెల్గటూరు, ఎండపల్లి మండలాల్లో సాధారణంగా వర్షం కురిసింది.

కూలీలకు చేతి నిండా పని...

జిల్లాల్లో వరిసాట్లు వేయడానికి గ్రామాల్లోని స్థానిక మహిళల కూలీలు అధికంగా వస్తున్నారు. వీరితో పాటు ఎప్పటిలాగే యూపీ, ఏపీ, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి సైతం పెద్ద ఎత్తున మగ, ఆడ కూలీలు జిల్లాకు వలస వచ్చారు. వానాకాలం, యాసంగి సీజన్‌లో కూలీలను బయట ప్రాంతాల నుంచి తెప్పించడానికి జిల్లాలో చాలా మంది మధ్యవర్తులుగా పని చేస్తున్నారు. వచ్చిన వారికి భోజనం, షెల్టర్లు అందిస్తున్నారు. మగ కూలీల బృందంలో 10-15 మంది ఉంటున్నారు. వీరు ఎకరానికి సుమారు రూ. 4,500 నుంచి రూ. 5,400 వరకు కూలీ తీసుకుని నాట్లు వేస్తారు. దీంతో నాట్లు వేసిన ఒక్కో కూలీకి రూ. 500 వరకు ఉపాధి లభిస్తోంది.

జోరుగా సాగు పనులు...

జిల్లాలో గడిచిన వారం రోజుల్లోనే ఏకంగా సుమారు సుమారు లక్ష ఎకరాల్లో నాట్లు పడ్డాయి. వానాకాలం సీజన్‌లో ఇప్పటివరకు సుమారు 1.25 లక్షల ఎకరాల వరకు వరి సాగైంది. నెలాఖరు నాటికి రెండున్నర లక్షల ఎకరాలు దాటే అవకాశముంది. అన్ని పంటలు కలిసి జిల్లాలో 4.50 ఎకరాల్లో సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, ప్రస్తుతం 1.42 లక్షల వరకు సాగవుతోంది. ఇందులో వరి పంటదే సింహ భాగం. రైతులు సన్నరకాలు, దొడ్డు రకాలు ఎక్కువ సాగు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు పత్తి 16,230 ఎకరాలు, కందులు 581 ఎకరాలు, సోయాబీన్ 352 ఎకరాలు, మొక్కజొన్న 28,081 ఎకరాలు, అనుములు 165 ఎకరాలు, చెరుకు 579 ఎకరాలు, పసుపు 6,619 ఎకరాలు సాగు అయింది. అయితే శరవేగంగా నాట్లు పడటంతో యూరియాకు డిమాండ్ ఏర్పడింది. రైతులు అవసరానికి మించి ఒకేసారి కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు. ఇటు పంటల వివరాలను నమోదు చేసే పనిలో వ్యవసాయాధికారులు నిమగ్నమయ్యారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు



వాణి, జిల్లా వ్యవసాయ అధికారి

జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వారం రోజులుగా వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి. ఎప్పటికప్పుడు సాగు వివరాలను సేకరించి నమోదు చేస్తున్నాము. వరి నాట్లు ఊపందుకుంటున్నాయి. మరో పక్షం రోజుల వరకు నాట్లు వేసుకునే వీలుంది. వ్యవసాయ దారులు, కూలీలు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.

పొలం పనుల్లో రైతులు నిమగ్నం



అల్లూరి మహేందర్ రెడ్డి, రైతు, వేంపేట

ఇటీవల కురుస్తున్న ముసురు వర్షాలతో సాగు పనులు జోరందుకున్నాయి. పొలం పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ప్రధానంగా వరి, మొక్కజొన్న, పసుపు, చెరుకు తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నా రు. మరోవైపు శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వర్షపు నీరు వచ్చి చేరుతుండడం ఆశాజనకంగా మారింది.



గాయత్రి పంప్ హౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

మిడ్ మానేరుకు గోదావరి జలాలు

7లో..

- శ్రీపాద ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలు షురూ..
- నంది పంప్ హౌస్‌కు 12,600 క్యూసెక్కుల నీటి తరలింపు
- ప్రభుత్వ ఆదేశాలతో నంది, గాయత్రి పంప్‌హౌస్‌లలో మోటార్లు ఆన్ చేసిన అధికారులు

పోలీసులకు ప్రశంసా పత్రాలు

అభినందించిన ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డీజీ



పోలీసులను అభినందిస్తున్న ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డీజీ షికాగోయల్

జగిత్యాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఓ పోక్సో కేసు వ్యవహారంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి నిందితులకు చట్టపరమైన శిక్ష పడేలా కృషి చేసిన పలువురు పోలీసు అధికారులకు ప్రశంసా పత్రాలను ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డీజీ షికాగోయల్ అందజేసి అభినందించారు. శనివారం హైదరాబాద్‌లో డీజీ రమా రాజేశ్వరీ, ఉమెన్స్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డీజీ షికా గోయల్‌లు జగిత్యాలకు చెందిన పోలీసు అధికారులకు ప్రశంసా పత్రాలను అందించారు. గొల్లపల్లి మండలం దట్నూరు గ్రామానికి చెందిన కొడిమ్యాల హరికృష్ణ అలియాస్ హరీశ్ గ్రామంలో కిరాణం దుకాణం నిర్వహిస్తూ మాయమాటలతో నమ్మించి ముగ్గురు బాలికలపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఫిర్యాదులపై 2022 ఏప్రిల్ 7వ తేదీన గొల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి మూడు వేర్వేరు కేసులు నమోదు చేశారు. ధర్మపురి అప్పటి సీఐ కోటేశ్వర్, జగిత్యాల డీఎస్పీ ప్రకాశ్ కేసును దర్యాప్తు చేశారు. సంబంధిత కేసులో విచారణ పూర్తి చేసిన జిల్లా న్యాయమూరి నీలిమ నిందుతుడిపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్క కేసుకు 20 ఏళ్ల చొప్పున కఠిన కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానా, బాధిత బాలికలకు ఒక్కొక్కరికి రూ. 3 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చారు. బాధిత బాలికలకు న్యాయం చేయడంలో కృషి చేసిన డీఎస్పీ ప్రకాశ్, సీఐ కోటేశ్వర్, ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి, పీపీ బాల త్రిపుర సుందరి, భరోసా సెంటర్ లీగల్ ఆఫీసర్ తేజ, కోర్టు కానిస్టేబుల్ శ్రీధర్‌లకు ఉన్నతాధికారులు ప్రశంసా పత్రాలను అందించగా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు

జిల్లా పశు వైద్యాధికారి వేణుగోపాల్

జగిత్యాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలతో ఉద్యోగులకు ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని జిల్లా పశు వైద్య అధికారి వేణుగోపాల్ రావు అన్నారు. శనివారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న నలుగురు వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారులకు సంబంధిత ఉత్తర్వుల పత్రాలను అందించారు. కోరుట్ల మండలంలో పనిచేస్తున్న కందుకూరి పూర్ణచందర్ రావును పొలాస పశు వైద్య ఉప కేంద్రానికి, జగిత్యాల రూరల్ మండలం పొలాసలో పనిచేస్తున్న వీణను పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి పశు వైద్య ఉప కేంద్రానికి, మల్లాపూర్ మండలం మొగిలిపేటలో పనిచేస్తున్న ఊషన్నను ఆసిఫాబాద్ జిల్లా చిర్రకుంటకు, సారంగపూర్ మండలం రేచపల్లిలో పనిచేస్తున్న సాబీర్‌ను కోరుట్ల మండలం పైడిమడుగుకు బదిలీ చేస్తూ జారీ అయిన ఉత్తర్వులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ పర్యవేక్షకులు రవి, సీనియర్ అసిస్టెంట్ అశోక్, సంతోష్ పాల్గొన్నారు.

భక్తిపారవశ్యంగా బోనాల జాతర



బోనాల జాతరలో పాల్గొన్న విద్యార్థులు

రాయికల్, జూలై 27: రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో ఆషాడ మాసం సందర్భంగా శనివారం బోనాల జాతరను భక్తిపారవశ్యంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన బోనాల నృత్యాలను ఆకట్టుకున్నాయి. సుమారు 100 మంది విద్యార్థినిలు సాంప్రదాయబద్ధమైన దుస్తుల్లో విచ్చేసి బోనాలను ఎత్తుకుని పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ప్రత్యేకంగా పోతరాజుల వేశధారణ, పెద్ద పులల వేశధారణలో విచ్చేసిన చిన్నారులు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బాలె జయశ్రీశేఖర్, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి ఇలా... బడికి వెళ్లేదెలా ?

- అధ్వానంగా కండ్లపల్లి ఆదర్శపాఠశాల రహదారి
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



రహదారి బురదమయంకావడంతో పొలాల గట్టుపై నుంచి వెళ్తున్న విద్యార్థులు

జగిత్యాలరూరల్, జూలై 27 : పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేసిన ఆశించినస్థాయిలో సౌకర్యాలు కల్పించడంలేదు. ఏటా విద్యార్థులు అరకొర వసతుల మధ్య చదివి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నా పాలకులు మాత్రం పట్టించుకోవడంలేదు. జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి ఆదర్శపాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు సుమారు 650కి పైగా చదువుతున్నారు. ఈ స్కూల్ వెళ్లడానికి మట్టి రహదారిని నిర్మించారు. ఇక్కడ వర్షం పడినప్పుడల్లా రహదారి బురదమయమవుతుంది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి నిత్యం నరకం అనుభవిస్తున్నారు. కొందరు విద్యార్థులు సైకిళ్ల అదుపుతప్పి కింద పడిపోతు న్నారు. కొందరు ఆటోలద్వారా బడికి వస్తున్నారు. పాఠశాల రహదారి చుట్టూ పక్కల ఎలాంటి కంచెలు లేకపోవడంతో పక్కనే ఉన్న పొలాలల్లో పడి గాయాపాలవుతున్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కండ్లపల్లి ఆదర్శపాఠశాల దుస్థితిపై విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు. రహదారి ఇలా ఉంటే.. బడికి ఎలా వెళ్లి చదువుకుంటామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాగోడు వినండి.. మాబడికి రహదారి నిర్మాణం చేపట్టి చదువులు సజావుగా సాగేలా చూడాలని విద్యార్థులు, తల్లితండ్రులు కోరుతున్నారు.

అభివృద్ధి కోసం కాదు..సొంత ప్రయోజనాల కోసమే

- ఎమ్మెల్యే పార్టీ మారితే బీఆర్‌ఎస్‌కు నష్టం లేదు
- జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్ పర్సన్

రాయికల్, జూలై 27: అధికారం చేపట్టిన ఏ ప్రభుత్వమైనా ప్రజల కోసం అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపడతాయని, ఎమ్మెల్యే సొంత ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరారని జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. రాయికల్ పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాయికల్ గ్రామ పంచాయతీని మూడవ శ్రేణి మున్సిపాలిటీగా ఉన్నతీకరించి పట్టణ అభివృద్ధి కోసం అప్పటి మాజీ ఎంపీ కవిత రూ.25 కోట్ల నిధులను మంజూరు చేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ గడిచిన ఐదేళ్ల కాలంలో రాయికల్ మండల, పట్టణ అభివృద్ధికి తనకున్న సీడీపీ నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా కేటాయించలేరని ఎద్దేవా చేశారు. నియోజకవర్గం అభివృద్ధి కోసమే పార్టీ మారారని చెప్పుకొస్తున్న ఎమ్మెల్యే అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యేకు తెలియకపోవడం బాధాకరమన్నారు. రూ.కోటి 63 లక్షల జనాభా ఉన్న మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం రూ.39 వేల కోట్ల నిధులను కేటాయించడం తీపిలేని ఉగాది పచ్చడిలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తురగ శ్రీధర్‌రెడ్డి, మ్యాకల కాంతారావు, మహేష్, సువర్ణసత్యనారాయణ, సాయికుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్ కుమార్, మహిళా అధ్యక్షురాలు స్పందన, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉదయశ్రీ, లావుడ్య సురేందర్ నాయక్, నాగరాజు, మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

అవార్డులందుకున్న జగిత్యాల నృత్య కళాకారులు

జగిత్యాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలకు చెందిన పలువురు నృత్య కళాకారులు హైద్రాబాద్‌లో శివాని ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల జాతరోత్సవంలో ప్రదర్శనలిచ్చి అవార్డులు అందుకున్నారు. శనివారం హైద్రాబాద్‌లోని చిక్కడపల్లిలో గల త్యాగరాజ గాన సభ నిలయంలో బోనాల జాతరోత్సవంలో భాగంగా వివిధ రంగాల వారికి కళారత్న, నాట్య రత్న అవార్డులను అందించారు. జగిత్యాలకు చెందిన మహదేవుని నిత్య శ్రీ, హంసిక, బద్రి శ్రేయస్సి, దోమ కొండ హిమశ్రీ, ముతుర్ల విరనికలు శివాష్టకం నృత్య ప్రదర్శన చేశారు. విద్యార్థులను శివానీ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపనపల్లి పరమేశ్వర్, వినుకొండ ఎమ్మెల్యే లీలావతి ఆంజనేయులు అభినందించి అవార్డులు అందించారు. నాట్య గురువు నాట్య సామ్రాట్ బొమ్మిడి నరేశ్ కుమార్‌ను కళారత్న అవార్డుతో సత్కరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ అశోక్ కుమార్
- గోదావరి వరద ముంపు ప్రాంతాల సందర్శన



ముంపు గ్రామాలను పరిశీలిస్తున్న ఎస్పీ

రాయికల్, జూలై 27: జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉం డాలని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా లో గోదావరి నది పరివా హక ప్రాంతంలో ఉన్న రాయికల్ మండలంలోని జగన్నాథ్‌పూర్, నాయకపోడు గ్రామం, బోర్నపల్లి బ్రిడ్జి, గ్రామాలను సందర్శించి, ముంపుకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలు సుకున్నారు. గోదావరి నది, కడెం ప్రాజెక్ట్ గేట్లు ఎత్తినప్పుడు పోలీస్ శాఖ తరపున ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉంటామని, గ్రామస్థుల రక్షణకు తగు జాగ్రత్తలు తీసుకుంటామని గ్రామస్థులకు భరోసా కల్పించారు. భారీ వర్షాల వల్ల ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ని వివిధ శాఖల సమన్వ యంతో ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా ప్రణాళికాబద్ధంగా పని చేయాల న్నారు. వర్షాల ప్రభావం, వరద పరిస్థితిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలను ఎప్పటికప్పుడు సామాజిక మాధ్య మాల ద్వారా ప్రజలను చైతన్యపరచాలని సూచిం చారు. ఎస్పీ వెంట ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, రాయికల్ ఎస్సై అశోక్ ఉన్నారు.

డయల్ 100కు తక్షణమే స్పందించాలి


డయల్ 100కు తక్షణమే స్పందించి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. రాయికల్ పోలీస్‌స్టేషన్ శనివారం ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది వివరాలు, విధుల నుంచి అడిగి తెలుసుకున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరుగకుండా చూసుకోవాలని ఆదేశించారు. అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా స్పందించాలని సూచించారు. ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని డ్రంకెన్ డ్రైవ్ చేసే వారిపై దృష్టి సారించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ రఘుచందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై అశోక్ ఉన్నారు.



వడ్డీ వ్యాపారిపై కేసు

సిరిసిల్ల క్రైం, జూలై 27: సిరిసిల్ల నెహ్రూనగర్‌కు చెందిన దుబాల మొండయ్య అనే వడ్డీ వ్యాపారిపై శనివారం కేసు నమోదు చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇంటి పత్రాలు, ఖాళీ బాండ్ పేపర్లు తాకట్టు పెట్టుకొని మొండయ్య అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చినట్లు, కట్టనివారి ఆస్తులు అక్రమంగా స్వాధీన చేసుకుంటున్నట్లు ఫిర్యాదులు అందడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా బాధితులు ఉంటేస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి మావోయిస్టు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు



మంథని, జూలై 27: భూమి కోసం.. భుక్తి కోసం.. పీడిత ప్రజల విముక్తి కోసం.. దశాబ్దాలుగా సాగు తున్న ప్రజా పోరులో నేలకొరిగిన మృత వీరులను స్మరించుకునేందుకు సీపీఐ మావోయిస్టు పార్టీ ఏటా జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించుకుంటోంది. వారోత్సవాలు జరుపుకోవాలని మావోయిస్టు పార్టీ ఇప్పటికే పత్రికా ప్రకటనతో పిలుపునిచ్చింది. నక్సల్బరి-శ్రీకాకుళం పోరాటాల వారసత్వాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పునికి పుచ్చుకుంది. ఈ చైతన్య ఉద్యమ వారసత్వ కారణంగా మంథని, పెద్దపల్లి, రామగుండం, జగిత్యాల, సిరిసిల్ల, హుస్నాబాద్, హుజూరాబాద్, జమ్మికుంట, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల్లో దొరలు, భూస్వాములు, పటేల్, పట్వారీల అరాచ కాలు, అణచివేతలపై ప్రజలంతా విప్లవోద్యమ చైతన్యంతో ప్రజలు దొరలు, దొరల గడీలపై దండ యాత్రలు చేయడంతో పాటు జగిత్యాల జైత్ర యాత్రతో పోరాటాల ఖిల్లా చరిత్రకెక్కింది. సీపీఐ మావోయిస్టు పార్టీకి సెంట్రల్ కమిటీ కార్యదర్శిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి దశాబ్దాల కాలంగా ప్రాతినిధ్యం వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా (ప్రస్తుత జగిత్యాల) బీర్‌పూర్ గణపతి స్వగ్రామం. గణపతి దళపతిగా పని చేసిన ఖిల్లా అయిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దాదాపు మూడున్నర దశాబ్దాలకుగా పైగా సాగుతున్న విప్లవోద్యమంలో వందల సంఖ్యలో వీరులు అమరలయ్యారు. నిరంతరం పోలీసుల దాడులు.. వరుస ఎన్‌కౌంటర్.. పెరిగిన ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్.. తగ్గిన రిక్రూట్‌మెంట్ల కారణంగా కొన్ని సంవత్సరాలుగా మావోయిస్టులు తమ కార్యకలాపాలను అటవీ ప్రాంతాలకే పరిమితం చేశారు.

మిడ్ మానేరుకు గోదావరి జలాలు

● శ్రీపాద ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలు షురూ.. ● నంది పంప్ హౌస్‌కు 12,600 క్యూసెక్కుల నీటి తరలింపు
● ప్రభుత్వ ఆదేశాలతో మోటార్లు ఆన్ చేసిన అధికారులు ● ప్రవాహాన్ని బట్టి రోజుకు 2 టీఎంసీల తరలింపు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో వరద నీరు పెద్ద ఎత్తున వస్తుండడంతో ప్రభుత్వ ఆదేశాలతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను మిడ్ మానేరుకు ఎత్తిపోయడం ప్రారంభించారు. శనివారం మధ్యాహ్నం నంది మేడారంలో గల నంది పంప్‌హౌస్ ఒక మోటారును ఆన్ చేసి సాయంత్రం వరకు క్రమంగా నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఈసారి కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి పోయకుండానే శ్రీపాద ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోస్తుండడం గమనార్హం. పెద్దపల్లి జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి శనివారం ఉదయం 14 వేల క్యూసెక్కులు, ఆ తర్వాత 13 వేలు, ఆ తర్వాత 16 వేలు, సాయంత్రం వరకు 12 వేల క్యూసెక్కులకు పెరుగుతూ, తగ్గుతూ వచ్చింది. మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రాజెక్టు నీటి మట్టం 17.396 టీఎంసీలకు చేరుకోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటి పారుదల శాఖ అధికారులు ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్ నుంచి ధర్మారం మండలంలో గల నంది పంప్ హౌస్‌కు గ్రావిటీ ద్వారా నీటిని వదిలిపెట్టారు. అక్కడి నుంచి మొదట ఒక మోటారును ఆన్ చేసి క్రమంగా సాయంత్రం 5 గంటల వరకు నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని నంది మేడారం రిజర్వాయర్‌లో ఎత్తిపోశారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా అండర్ టన్నెల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంప్‌హౌస్‌కు తరలిస్తున్నారు. అక్కడ నుంచి మోటార్ల ద్వారా వరద కాలువలో నీటి ఎత్తిపోయడంతో మిడ్ మానేరుకు వెళుతున్నాయి. నంది మేడారం పంప్‌హౌస్‌లో మొత్తం 7 మోటార్లు ఉన్నాయి. ఒక్కో మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తారు. మొత్తం మోటార్లు నడిస్తే 22,050 క్యూసెక్కుల నీళ్లు అంటే 2 టీఎంసీల నీటిని తరలించవచ్చు. రోజుకు రెండు టీఎంసీలను తరలించే విధంగా అండర్ టన్నెళ్లు, పంప్‌హౌస్‌లను నిర్మించారు. సాయంత్రం 6 గంటల వరకు ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సాయంత్రం వరకు 12,931 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగి పోవడం, అన్నారం బ్యారేజీకి బుంగ పడడం, సుందిళ్ల బ్యారేజీకి స్వీపేజీ సమస్య ఉండడంతో వీటిని సందర్శించిన ఎన్‌డీఎస్‌ఏ బృందం మరమ్మతులు చేయాలని సూచించింది. వాటికి మరమ్మతులు జరుగుతుండగానే వర్షాలు మొదలయ్యాయి. దీంతో ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు మూడు బ్యారేజీల గేట్లు తెరిచి ఉంచాలని ప్రభుత్వానికి సూచించింది. దీంతో అక్కడి నుంచి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని ఎత్తిపోయడం లేదు. ఎల్లంపల్లి ఎగువ భాగాన కురుస్తున్న వర్షాలు, కడెం ప్రాజెక్టు నిండి తద్వారా వస్తున్న అదనపు జలాలతో వారం రోజుల్లో 13 టీఎంసీల నీళ్లు ప్రాజెక్టులోకి వచ్చాయి. ఈ నెల 18వ తేదీ వరకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి మట్టం 5.140 టీఎంసీలు కాగా, ఆ మరుసటి రోజు నుంచి కురుస్తున్న వర్షాలతో వరద పెరిగింది.

శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ (మిడ్ మానేరు) పూర్తి స్థాయి నీటి మట్టం 27 టీఎంసీలు కాగా, అందులో 6 టీఎంసీలు, లోయర్ మానేరు డ్యామ్ నీటి మట్టం 24 టీఎంసీలు కాగా, అందులో 6 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. క్యాచ్‌మెంట్ ఏరియాలో పెద్దగా వరద లేక పోగా, ఎస్సారెస్పీకి కూడా వరద లేదు. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లికి వరద పెరిగిన తర్వాత మిడ్ మానేరుకు నీటిని తరలించాలని నాలుగు రోజుల క్రితమే ప్రభుత్వం ప్రాజెక్టు అధికారులకు సూచించింది. జూన్ మాసంలో పెద్దగా వర్షాలు పడక పోగా, జూలై ఆరంభంలో కూడా గడ్డు పరిస్థితులు ఉండడంతో, గత ఏడాది కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్లను ఆన్ చేసి 8 నుంచి 9 టీఎంసీల నీటిని ఎల్లంపల్లిలోకి ఎత్తి పోశారు. ఇంతలో వరుసగా భారీ వర్షాలు పడడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలి పెట్టారు.

మిడ్ మానేరు, ఎల్‌ఎండీల పరిస్థితి దయనీయంగా ఉండడంతో గేట్లనుఎత్తకుండా ఎత్తిపోతలను ప్రారంభించారు. ఎల్లంపల్లికి పైనుంచి వస్తున్న వరద నీటిని వచ్చినట్లే తరలించాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు ఎప్పటికప్పుడు నీటి మట్టాలను అంచనా వేస్తూ ఎత్తిపోతలను కొనసాగిస్తున్నారు. పైనుంచి వరద పెరిగితే మాత్రం రోజుకు 2 టీఎంసీల నీటిని తరలించాలని అధికారులు నిర్ణయించారు.


నీటితో కళకళలాడుతున్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు


నంది మేడారం పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోస్తున్న నీరు

గాయత్రి పంప్‌హౌస్ నుంచి నీటి విడుదల

● నాలుగు పంపుల ద్వారా మిడ్‌మానేరుకు 12,600 క్యూసెక్కుల నీరు


గాయత్రీ పంప్‌హౌస్ వద్ద కాంగ్రెస్ నాయకుల సంబరాలు

రామడుగు, జూలై 27: రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శనివారం సాయంత్రం అధికారులు నీటిని విడుదల చేశారు. మొదట ఒక బాహుబలి పంపు నుంచి నీటి విడుదల చేసిన అధికారులు రాత్రి వరకు నాలుగు పంపుల ద్వారా నీటి విడుదలను కొనసాగించారు. పంప్‌హౌస్ నుంచి నేరుగా బాహుబలి పంపుల ద్వారా గ్రావిటీ కాల్వకు విడుదలైన నీరు నేరుగా వరద కాలువ ద్వారా పరవళ్లు తొక్కుతూ ముందుకు సాగింది. ఇక్కడ 7 బాహుబలి పంపులు ఉండగా ఒక్కో పంపు ద్వారా రోజుకు 3150 క్యూసెక్కుల నీరు తరలి తరలించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అయితే ఇక్కడ నాలుగు పంపుల ద్వారా నీటిని విడుదల చేస్తుండగా 12,600 క్యూసెక్కుల నీరు తరలివెళ్తున్నది. వరద కాలువ ద్వారా నీరు రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులోకి వెళ్తుంది. వరద కాలువకు నీటిని విడుదల చేయడంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల పోటాపోటీ పూజలు

బీఆర్ఎస్ డిమాండ్ చేయడంతోనే నీటిని విడుదల చేశారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు గాయత్రీ పంప్‌హౌస్ వద్ద నీటిలో పసుపు కుంకుమ పూలు చల్లి పూజలు నిర్వహించారు. మరోవైపు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి ఫలితంగానే నీటి విడుదల చేశారని హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు గాయత్రీ పంప్ హౌస్ వద్దకు పెద్ద ఎత్తున తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మిడ్ మానేరుకు చేరుకున్న ఎల్లంపల్లి జలాలు

బోయినపల్లి, జూలై 27: మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి జలాలు చేరుకున్నాయి. ఎల్లంపల్లి నుంచి నంది మేడారం గాయత్రి పంప్ హౌస్ ద్వారా నీటి ఎత్తిపోతలు శనివారం ప్రారంభం కావడంతో ప్రాజెక్టులోకి రాత్రి 9 గంటల వరకు 2500 క్యూసెక్కుల ప్రవాహం ఎల్లంపల్లి నుంచి వరద కాలువ ద్వారా వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 305.62 మీటర్లు ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.50 టీఎంసీలకు ప్రస్తుతం 5.90 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ధర్మపురి గోదావరి వద్ద పెరిగిన వరద

● కడెం నుంచి 6,670 క్యూసెక్కుల నీరు విడుదల


ధర్మపురి వద్ద గోదావరి నది ప్రవాహం

ధర్మపురి, జూలై 27: ధర్మపురి వద్ద గోదావరి నది నీటి ప్రవాహం శనివారం వేగంగా కొనసాగింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండుతున్నాయి. దీనికి తోడు కడెం నుంచి 6,670 క్యూసెక్కుల నీరు గోదావరిలోకి విడుదల చేశారు. దీంతో ఆలయ స్నానఘట్టాల ముందు వరకు నీరు చేరింది. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ సిబ్బంది మైకుల ద్వారా ప్రచారం చేసి అప్రమత్తం చేశారు. నదీతీర ప్రాంతాలను ప్రజలను అప్రమత్తం చేశారు. రైతులు, కూలీలు జాగ్రత్తలు వహించాలని తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్ కుమార్, సిబ్బంది చర్యలు చేపట్టారు. రాయపట్నం వంతెన వద్ద ప్రజలను అప్రమత్తం చేశారు.

ఎస్సారెస్పీలోకి 35,078 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. శనివారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 35,078 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 31.035 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 66.508 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 605 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 24.766 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.354 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.


ఎస్సారెస్పీ ప్రాజెక్టు

పరీక్షల ఒత్తిడి తట్టుకోలేక మెడికో ఆత్మహత్య


కోమళ్ల శిరీష(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూలై 27: పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేక కరీంనగర్ శివారులోని ఓ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కోమళ్ల శిరీష(20) అనే విద్యార్థిని శనివారం ఆత్మహత్య చేసుకుంది. కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదులోని వివరాల ప్రకారం..మరో మూడు రోజుల్లో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం పరీక్షలు ఉండటంతో ఒత్తిడిని భరించలేక శిరీష ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. చదువు తన నుంచి కావటం లేదని తరచుగా బాధపడిన ఒక్కగానొక్క కూతురు శిరీషను తల్లిదండ్రులు ఓదార్చుతూ భవిష్యత్ బాగుంటుందని సర్దిచెప్పేవారు. శనివారం ఉదయం తోటి విద్యార్థులతో కలిసి కరీంనగర్ నుంచి బస్సులో ప్రతిమ వైద్య కళాశాలకు వెళ్లింది. అనంతరం శిరీష తరగతులు ముగిసిన తరువాత 3 గంటలకు స్నేహితులతో కలిసి కరీంనగర్‌లోని విద్యానగర్‌లో ఇంటికి చేరింది. శిరీష తల్లిదండ్రులు కూడా అదే కళాశాలలో ఉద్యోగం చేస్తున్నారు. సాయంత్రం విధులు ముగించుకుని అందరం కలిసి ఇంటికి వెళదామని తల్లిదండ్రులు శిరీషకు చెప్పినప్పటికీ వినకుండా ఇంటికి చేరుకుంది. వెంటనే తల్లి ఇంటికి చేరుకునే సరికి శిరీష ఉరికి వేళాడుతూ కనిపించింది. దీంతో వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించిందని వెల్లడించారు. పరీక్షల ఒత్తిడి తట్టుకోలేకనే తన కూతరు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎల్‌ఎండీలోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్, జూలై27: గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి స్వల్పంగా వరద నీరు చేరుతోంది. ఎల్ఎండీ పూర్తి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా శనివారం సాయంత్రం వరకు 5.330 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. మోయతుమ్మెద వాగు నుంచి 576 క్యూసెక్కుల నీరు ఎల్ఎండిలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. గత సంవత్సరం ఇదే సమయంలో ఎల్ఎండిలో 20 టీఎంసీలకు పైన ఉండగా పైనుంచి మోయతుమ్మెద, ఎంఎంఆర్ నుంచి కలిపి సుమారు 19వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లోలు ఎల్ఎండిలోకి వస్తుండటంతో ఎల్ఎండి పూర్తి స్థాయిలో నిండుతుండగా అధికారులు 16గేట్లు ఎత్తి 56వేల క్యూసెక్కులకు పైగా దిగువకు గోదావరిలోని నీటిని విడుదల చేశారు. కానీ ప్రస్తుతం ఎల్ఎండీ పరిస్థితి దానికి భిన్నంగా ఉంది. వర్షాలు కురుస్తున్నప్పటికీ ఎగువన కుంటలు, వాగులు,చెరువులు మత్తడి దూకకపోవడంతో పాటు, పైనుంచి మోయతుమ్మెద వాగులోనికి వరద నీరు కూడా రాకపోవడంతో ఎల్ఎండీలోని నీటి ఇన్‌ఫ్లోలు చాలా స్వల్పంగా ఉన్నాయి.


ఎల్‌ఎండీ రిజర్వాయర్

వృద్ధురాలి ఆత్మహత్య

శంకరపట్నం, జూలై 27: కేశవపట్నం గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నవేణి లచ్చమ్మ (89) అనే వృద్ధురాలు అనారోగ్య సమస్యలు భరించలేక ఈ నెల 26న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 26న సాయంత్రం మృతి చెందింది. మృతురాలి కుమారుడు చెన్నవేణి కొంరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

మానకొండూర్, జూలై 27 : కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని సదాశివపల్లికి చెందిన అదృశ్యమైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైనట్లు స్థానిక సీఐ సదన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సదాశివపల్లికి చెందిన గాలిపల్లి శంకర్(40) అనే వ్యక్తి పేయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 25న కూరగాయల కోసం కరీంనగర్‌కు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని తెలిపారు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా 26న తీగల వంతెన సమీపంలోని చెక్‌డ్యాం వద్ద శంకర్ దుస్తులు కనిపించడంతో అతని భార్యా లీల స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి గాలిస్తుండగా శనివారం చెక్‌డ్యాంలో మృత దేహం లభ్యమైనట్లు సీఐ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి విక్రయదారుడి రిమాండ్

మానకొండూర్, జూలై 27 : గంజాయిని విక్రయించేందుకు వెళ్లుతుండగా వాహనాల వాహనాల తనిఖీలో పట్టుబడ్డ యువకుడిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామానికి చెందిన సంగ వినయ్ అనే యువకుడు 240 గ్రాముల గంజాయిని విక్రయించేందుకు ద్విచక్ర వాహనంపై కరీంనగర్‌కు బయలుదేరాడు. సదాశివపల్లి వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద ఉన్న 240 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కారు ఢీకొని తండ్రీకొడుకులకు గాయాలు

ఓదెల, జూలై 27 : మండలంలోని పొత్కపల్లి పెద్ద చెరువు మూల మలుపు వద్ద శనివారం కారు ఢీకొని పొత్కపల్లికి చెందిన దానవేని కుమార్, అతని కుమారుడు అర్జున్ సాయిలకు గాయాలయ్యాయి. పొత్కపల్లి నుంచి కుమార్ తన కుమారుడితో ద్విచక్ర వాహనంపై సుల్తాన్‌బాద్ వైపు వెళుతుండగా, మంచిర్యాలలో క్రషర్ నిర్వహించే వ్యక్తులు జమ్మికుంట వైపు వస్తున్న క్రమంలో పొత్కపల్లి పెద్ద చెరువు మూలమలుపు వద్ద వేగంగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో తండ్రికొడుకులిద్దరు పొలంలో ఎగిరిపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, పొత్కపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, జూలై 27: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌కు చెందిన ఆన గీత(35) కడుపునొప్పి భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. అల్మాస్‌పూర్‌కు చెందిన గీతకు వివాహమైన ఐదేళ్లకు విడాకులయ్యాయి. ఏడాది క్రితం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేటకు చెందిన రాజుతో వివాహమైంది. అప్పటి నుంచి ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. ఈ నెల 26న రాజు తన భార్య గీతను అల్మాస్‌పూర్‌లోని అత్తిగారింటికి తీసుకొచ్చి స్వగ్రామానికి వెళ్లిపోయాడు. ఓ వైపు సంతానం కలగకపోవడం, మరో వైపు తీవ్రమైన కడుపునొప్పి భరించలేక గీత మనస్తాపంతో శుక్రవారం ఇంట్లో ఉరేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లీ చదువుకుంటావా..

● వ్యవసాయ పనులు చేస్తున్న బాలికతో కేంద్ర మంత్రి బండి సంజయ్ ● హాస్టల్‌లో చేర్పించి చదివిస్తానని హామీ


బాలికతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

గంగాధర, జూలై 27: గంగాధర మండలం చర్లపల్లి(ఆర్)లో ఎంఎన్ఆర్ఈజీఎస్‌లో 15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం తిరిగి వెళ్తుండగా గ్రామ శివారులో వ్యవసాయ కూలీల వద్దకు వెళ్లి మాట్లాడారు. ఓ బాలికను చూసి కేంద్ర సహాయ మంత్రి సంజయ్ ఎందుకు చదువుకోవడం లేదని ప్రశ్నించారు. కుటుంబ పరిస్థితిపై ఆరా తీశారు. దీంతో తన పేరు బొల్ల అక్షయ అని టెన్త్ పాసైనప్పటికీ ఆర్థిక పరిస్థితులు బాగోలేక కూలీ పనులకు వెల్లుతున్నానని బదులిచ్చింది. చదువుకోవాలని ఉందని తెలపడంతో వెంటనే అక్కడే ఉన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డిని పిలిచి బాలిక వివరాలు తీసుకుని వెంటనే కాలేజీలో చదివించడంతో పాటు ఆసక్తి ఉంటే హాస్టల్‌లో చేర్పించాలని చెప్పారు. దీంతో బాలిక తండ్రి మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, రాష్ట్ర నాయకుడు మేకల ప్రభాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్‌కి వెళ్లిన తన భర్త ఆచూకీ తెలుపాలని వినతి


కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు విన్నవిస్తున్న కుటుంబం

కరీంనగర్ క్రైం : జీవనోపాధి కోసం దుబాయ్‌కి వెళ్లిన తన భర్త ఆచూకీ తెలియక ఇబ్బందులు పడుతున్నామని, ఆచూకీ కనుక్కోవాలని శనివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను బాధితులు కలిశారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గురుకులకొండాపూర్ గ్రామానికి చెందిన చొక్కల శ్రీధర్ 2022 జూలై 27న దుబాయికి వెళ్లి అక్కడ షార్జాలోని సరత్ కంపెనీలో పనిచేసేవాడు. కంపెనీలో తక్కువ జీతం, యాజమాన్యం పెట్టే ఇబ్బందులను తట్టుకోలేక 2023 సెప్టెంబరు 7న కంపెనీ నుంచి బయటకు వెళ్లాడు. శ్రీధర్ కుటుంబ సభ్యులు అప్పుచేసి 2023 అక్టోబరు22న విమానం టికెటన్ పంపించారు. కానీ శ్రీధర్ రాలేదు. అప్పటి నుంచి శ్రీధర్ ఆచూకీ లభించలేదు. శ్రీధర్‌కు రెండేళ్ల వయస్సు, ఏడాదిన్నర వయస్సున్న ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శ్రీధర్ భార్య చొక్కల అఖిల తన ఇద్దరు కూతుళ్లతో, కుటుంబ సభ్యులు శనివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన కేంద్ర మంత్రి షార్జాలోని ఎంబసీ అధికారులకు మెయిల్ చేశారు. రెండు రోజులు సెలవులు ఉన్నందున సోమవారం వరకు వివరాలు వస్తాయని కేంద్ర మంత్రి చెప్పినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

మెట్‌పల్లి రూరల్, జూలై, 27: మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యాసాగర్‌ను శనివారం కలెక్టర్ సత్యప్రసాద్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం పాఠశాలలోని విద్యార్థి రాజారపు గణాధిత్య మృతి చెందడంతో పాటు మరో ఇద్దరు విద్యార్థులు రాపర్తి హర్షవర్ధన్, అడేపు గణేష్ అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థుల పట్ల బాధ్యత రహితంగా వ్యవహరించారని, జరిగిన ఘటనపై విచారణ చేసి, ఆరోపణలు ఎదుర్కొంటున్న పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యల్లో భాగంగా కలెక్టర్ సస్పెండ్ చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని రైతు మృతి

ధర్మపురి, జూలై 27: ధర్మపురి మండలంలోని నేరెళ్ల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని గోవింద్‌పల్లెకు చెందిన కోల శంకర్ (40) అనే రైతు శనివారం సాయంత్రం మృతి చెందాడు. శంకర్ వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మమత, ఇద్దరు కొడుకుల ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రెండు ఆలయాల్లో చోరీ

ఎల్లారెడ్డిపేట, జూలై 27: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో దొంగలు శుక్రవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. ప్రధాన ద్వారం తాళాలు పగల కొట్టిన దొంగలు అమ్మవారి బంగారు పుస్తెలు, ముక్కు పుడక ఎత్తుకెళ్లారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సమస్యల వలయంలో పెద్దాపూర్ గురుకులం

● రెండు రోజుల క్రితం ఫిట్స్‌తో విద్యార్థి మృతి ● విషపురుగు కుట్టి మరో ఇద్దరికి అస్వస్థత ● ఇంటి దారి పట్టిన విద్యార్థులు

మెట్‌పల్లి రూరల్, జూలై, 21: మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపు బాలుర గురుకుల పాఠశాల సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. పాఠశాలలో సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు విద్యార్థులకు అందని ద్రాక్షగానే మారాయి. గురుకుల పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణానికి నిధులు కేటాయింపుల్లో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వెంటాడుతుండడంతో విద్యార్థులు పాత గదుల్లోనే దినదిన గండంగా చదువులు సాగించాల్సి పరిస్థితి నెలకొంది. పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో 546 మందికి పైగా విద్యార్థులు ఉన్నప్పటికీ వసతులతో కూడిన శాశ్వత భవనాలు కరువయ్యాయి. ఈ పాఠశాలలో 5 నుంచి 10వ తరగతితో పాటు ఇంటర్ కళాశాలను కూడా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 1970లో నిర్మించిన రేకుల షెడ్డులో కొనసాగిస్తున్నారు. కనీసం పాఠశాలలో కిటికీలు లేని గదుల్లోనే విద్యార్థులు చదువు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలం, చలికాలం వచ్చిందంటే విద్యార్థులకు మరిన్ని కష్టాలు ఎదురవుతూనే ఉంటాయి. సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావును విద్యార్థులు అప్పట్లో విన్నవించగా 2016లో రూ. 4.25కోట్లు నిధులు మంజూరు చేయించగా 2018లో పనులు ప్రారంభించారు. భవనం మంజూరు అయినప్పటికీ సొసైటీ సంస్థ నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వం వల్ల భవన నిర్మాణ పనులు నత్తనడకగా చేపట్టారు. కనీసం పాఠశాల గదుల చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించక పోవడంతో పాములు విష పురుగులతో విద్యార్థులు భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


గురుకులం నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

పాఠశాలలో శుక్రవారం వేకువజామున విద్యార్థి రాజారపు గణాధిత్య ఫిట్స్‌తో మృతి చెందగా.. మరో ఇద్దరు విద్యార్థులు విష పురుగు కుట్టి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు సమాచారం అందించి వారిని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు. ఒకే రోజు విద్యార్థి మృతి చెందడం, మరో ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురైనా కూడా కనీసం చికిత్స అందిచడానికి స్టాఫ్ నర్సు లేక పోవడం గమనార్హం. విద్యార్థులు భయంతో ఇంటి దారి పడుతున్నారు. రాత్రివేళ ఏమైనా ఇబ్బందులకు గురైతే పట్టించుకోవడానికి వైద్య సిబ్బంది లేరని అందుకే ఇంటికి తీసుకెళ్తున్నామని తల్లిదండ్రులు తెలిపారు.

తీరు మారకపోతే చర్యలు తప్పవు

ప్రధానోపాధ్యాయుడిపై అడిషనల్ కలెక్టర్ ఆగ్రహం



ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అడిషనల్ కలెక్టర్

ఇబ్రహీంపట్నం, జూలై 27: తీరు మారకపోతే చర్యలు తప్పవని ఇబ్రహీం పట్నం జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజన్న పై ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ జనార్ధన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చేసిన పనుల వివరాల గురించి ప్రధానోపాధ్యాయుడిని అడుగుగా సరైన సమాధానం రాక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ఊరు-మన బడి కార్యక్రమం పనులు ఎందుకు నిలిచిపోయా యని, దానికి సంబంధించిన పనులు వివరాలు తెలుపాలని ప్రధానోపాధ్యాయుడిని ప్రశ్నించగా ఏమి లేవని సమాధానం ఇవ్వడంతో అడిషనల్ కలెక్టర్ సీరియస్ అయ్యారు. పాఠశాలలో టాయిలెట్‌ల నిర్వహణ, వంటశాల, పాఠశాల అవరణలో చెత్త చెదరం ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. తీరు మారకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేందర్‌రెడ్డి, ఎంపీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గండి పడిన మత్తడికి మరమ్మతులు చేపట్టాలి

కాంగ్రెస్ కోరుట్ల నియోజక వర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు



ఆత్మకూర్‌లో పెద్దచెరువు మత్తడిని పరిశీలిస్తున్న జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లి రూరల్, జూలై 27 : మండలంలోని ఆత్మకూర్ గ్రామ శివారులోని గండిపడిన పెద్దచెరువు మత్తడికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజక వర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కోరారు. శనివారం గండి పడ్డ మత్తడిని నాయకులతో కలిసి పరిశీలించారు. మత్తడికి ఖర్చు అంచనా వివరాలను ఇరిగేషన్ డీఈ అరుణోదయ్ కుమార్ అడిగి తెలుసుకోని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రూ. 19.5 లక్షలను మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు. దీంతో అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట మాజీ ఉపసర్పంచ్ నేరెళ్ల శ్రీధర్, మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

మోడల్ స్కూల్‌లో తెలంగాణ బోనాలు, మెహెందీ వేడుకలు



మెహిందీ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

కథలాపూర్, జూలై 27 : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శనివారం ఆషాఢ మాసంలో నిర్వహించే తెలంగాణ బోనాలు, మెహిందీ వేడుకలు నిర్వహించారు. ఈ సీజన్‌లో తెలంగాణలో నిర్వహించే ఈ పండగల ప్రాశస్త్యాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఉపవాస దీక్షలు, అమ్మవారి గొప్పదనం, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాల గురించి చెప్పారు. విద్యార్థులతో బోనాలు తీయించడంతో పాటు మెహిందీ వేడుకల ఆవశ్యకత తెలియజేశారు. పోతరాజుల వేషాలు అలరించాయి. ప్రిన్సిపాల్ తాటికొండ నరేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

ఆగస్టు 18న రాష్ట్ర పద్మశాలి సంఘ ఎన్నికలు

కోరుట్ల, జూలై 27: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఎన్నికలు ఆగస్టు 18న నిర్వహించడానికి రాష్ట్ర సంఘ సభ్యులు తీర్మానం చేసినట్లు సంఘ రాష్ట్ర నాయకులు తెలిపారు. శనివారం పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో రాష్ట్ర పద్మశాలి సంఘ నాయకులు స్థానిక సంఘ నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడుగా పోటీ చేస్తున్న వల్లకాటి రాజుకుమార్ మద్దతు పలుకాలని రాష్ట్ర నాయకులు కోరారు. తెలంగాణ పద్మశాలీలను బలోపేతం చేయడానికి వల్లకాటి రాజు కుమార్‌కు మద్దతు గా వేముల బాలరాజు (జనగామ), డా. చందా మల్లయ్య (హన్మకొండ), వేముల వెంకన్న (మహబూబాబాదు), బాల్నే శరత్‌బాబు(వరంగల్), రుద్ర శ్రీనివాస్ (జగిత్యాల) జిల్లా అధ్యక్షుల మద్దతు పలుకుతున్నట్లు వారు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, జిల్లా దనంజయ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం

బీజేపీ మండల అధ్యక్షుడు బాయి లింగారెడ్డి

ఇబ్రహీంపట్నం, జూలై 27: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని ఇబ్రహీంపట్నం జడ్పీటీసీ స్థానం కైవసం చేసుకుంటామని బీజేపీ మండల అధ్యక్షులు బాయి లింగారెడ్డి ధీమ వ్యక్తం చేశారు. శనివారం ఆయన మండలంలోని అమ్మక్కపేట గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షులు బాయి లింగారెడ్డి ఆధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జెండాను లింగారెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని గ్రామాలలో బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమ వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఎలేటి నరేందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సుంచు రణధీర్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు

రాయికల్, జూలై 27: రాయికల్ పట్టణంలో వర్షాకాలం సమీపించిన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ పట్టణంలో శనివారం కౌన్సిలర్ సాధారణ సమావేశం జరిగింది. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పారిశుధ్య నిర్వహణ, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, వార్డులలో ఫాగింగ్ చేయడం, వర్షపు నీరు నిల్వ ఉండకుండా మోటార్ల ద్వారా నీటని తొలగించడవంటివి చేస్తున్నామన్నారు. పట్టణంలోని 12 వార్డులలో స్లాబ్ కల్వర్టులు, మురికి కాలువలు నిర్మించేందుకు రూ.20 లక్షలతో తీర్మానం చేశారు. ఈ సమావేశంలో 18 అంశాలను ఏకగ్రీవంగా తీర్మా నించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, మున్సిపల్ కమిషనర్ బి.చిరంజీవి, కౌన్సిలర్లు కన్నాక మహేందర్, మారంపెల్లి సాయి కుమార్, తురగ శ్రీధర్ రెడ్డి, వల్లకొండ మహేష్ గౌడ్, కల్లెడ సునీత, శ్రీరాముల సువర్ణ, మ్యాకల కాంతారావు, మేనేజర్ వెంకటి, ఏఈ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులం ఘటనపై కలెక్టర్ ఆగ్రహం

● విద్యార్థులపై బాధ్యతారహితంగా వ్యవహరిస్తే చర్యలు: కలెక్టర్ సత్యప్రసాద్



పెద్దాపూర్ గురుకులం ఉపాధ్యాయల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లి రూరల్, జూలై, 27 : మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో జరిగిన ఘటనపై ఉపాధ్యాయులు వ్యవహరించిన తీరు పట్ల కలెక్టర్ సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. గురుకులంలో జరిగిన సంఘటనపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి రాజారపు గుణాధిత్య మృతికి, అస్వస్థతకు గురైన రాపర్తి హర్ష, అడెపు గణేష్ కారణాలపై సమగ్ర విచారణ జరిపాలని అధికారులను ఆదేశించారు. అస్వస్థకు గురైనా వారి గురించి తోటి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. జరిగిన ఘటనపై పూర్తి నివేదికను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన గదులను పరిశీలించి కిటికీలు లేకపోవడం, పరిసరాలలో పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో ఉపాధ్యాయులతో పాటు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన భవనం ఎందుకు వాడుకోవడం లేదని ప్రశ్నించగా కరెంటు, ప్లంబింగ్ పనులు పూర్తి కానందున ఉపయోగించుకోలేదని ఉపాధ్యాయులు తెలిపారు. పూర్తి స్థాయిలో పనులకు రూ. 15లక్షల నిధులు మంజూరు చేశామని త్వరగా పూర్తి చేయించి అందులోనే విద్యార్థులను ఉంచాలన్నారు. జరిగిన ఘటనపై విచారణ చేసి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధానోపాధ్యాయుడు బాధ్యతరహితంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నిజామాబాద్‌లో చికిత్స తీసుకుంటున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని అవసరమైతే హైదరాబాద్‌కు తరలించాలని వైద్య శాఖ, ఆర్డీవోలను సూచించినట్లు తెలిపారు. పాఠశాల ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి సందర్శిం చి గదులను పరిశీలించి జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు. అస్వస్థ లకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిలపై అరా తీశారు. వీరి వెంటా ఎంఈవో భీమయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎస్సై కిరణ్, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, రేవెన్యూ డీటీ రాజ్‌మహ్మద్, ఆర్‌ఐ కాంతయ్య, అధికారులు, వైద్య సిబ్బంది ఉన్నారు.



పెద్దాపూర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో జరిగి ఘటనపై తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్లక్ష్యంగా ఉండడటం సరికాదని, త ల్లిదండ్రులను విడిచి పెట్టి తమ వద్ద ఉన్న వారిని సొంత బిడ్డలగా చూసుకోవాలన్నారు. మృతి చెందిన గుణాధిత్య కుటుంబ సభ్యులను ప్రభుత్వం అదుకోవాలని, చికిత్స పొందుతున్న విద్యార్థులకు నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. పాఠశాలలో సమస్యలు ఉంటే ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ దృష్టికి తేవాలని ఉపాధ్యాయులకు తెలిపారు. కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు గురుకల పాఠశాలను సందర్శించి విద్యార్థి మృతి, అస్వస్తతకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ కోరెపు రవి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, జెట్టి లక్ష్మణ్, లింగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన విద్యార్థులను నిమ్స్‌కు తరలింపు

పాఠశాలలో అస్వస్థతకు గురైన ఇద్దరు విద్యార్థులను నిమ్స్‌కు తరలించారు. శనివారం నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్న గురుకుల పాఠశాల విద్యార్థులు రాపర్తి హర్ష, అడేపు గణేష్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు విద్యార్థులను ప్రత్యేక వాహనంలో తరలించినట్లు పేర్కొన్నారు.

పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య - అనిల్

కోరుట్ల, జూలై 27 : తీవ్ర వర్షాల దృష్ట్యా పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండి అంటు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలను పాటించాలని మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య-అనిల్ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో అధికారులు కౌన్సిల్ సభ్యులతో అత్యవసర సమావేశం మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఎజెండా అంశాలను కౌన్సిల్ సభ్యుల ముందుంచగా వారు ఏకగ్రీవ తీర్మానంతో ఆమోదించారు. వర్షాకాల దృష్ట్య పట్టణంలోని వివిధ కాలనీలలో గుంతలను స్టోన్ డస్ట్‌తో నింపే విధంగా అధికారులు చర్యలు తీసు కోవాలని వార్డు సభ్యులు సభా దృష్టికి తీసుకుపోయారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ లావణ్య మాట్లాడారు. వర్షాకాలం దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదురు కాకుండా చూసుకోవాలని అధికారుకలు సూచించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కమీషనర్ తిరుపతి, మేనేజర్ శ్రీనివాస్, టీపీవో ప్రవీణ్ కుమార్, ఏవో శివకుమార్, టీపియస్ రమ్య, లక్ష్మిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సన్మానం

మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య దంపతులను పట్టణ లారీ అసోసియేషన్ సభ్యులు శనివారం సన్మానించారు. లారీ అసోసియేషన్ అధ్యక్షుడు 21వ వార్డు కౌన్సిలర్ అన్వర్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు అన్నం లావణ్య-అనిల్‌ను సన్మానించి అభినందించారు. కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినందుకు చైర్‌పర్సన్ దంపతులకు స్వాగతం పలుకుతూ అభినందించారు.

ఈ కార్యక్రమంలో లారీ డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు మైమద్, సఫియోద్దిన్, కరీం, అమీర్, షకీల్‌లు పాల్గొన్నారు.



చైర్‌పర్సన్ దంపతులను సన్మానిస్తున్న లారీ అసోసియేషన్ సభ్యులు

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

మెట్‌పల్లి, జూలై, 27 : ఈనెల 31న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అధ్యక్షురాలు కూన సరస్వతి, సులోచన పిలుపునిచ్చారు. చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనేందుకు మధ్యాహ్న భోజన కార్మికులకు అవకాశం ఇవ్వాలని శనివారం ఆర్డీవో, ఎంఈవో కార్యాలయాల్లోని అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు భారత, రాజగంగు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : ఈ నెల 31న వంట కార్మికులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు కోరారు. శనివారం పట్టణంలోని మానవ వనరుల కార్యలయం వద్ద మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిడ్ డే మీల్స్ వర్కర్ యూనియన్ నాయకులు కొంక బాగ్యలక్ష్మి, సంగెం పద్మ, కొంతం రాజ, ఎండి మౌలనాలతో పాటు పలువురు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సన్మానం

మెట్‌పల్లి, జూలై, 27 : మెట్‌పల్లి కోర్టు ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహించిన మాధవి బదిలీపై వెళ్తున్నందున న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి ఆధ్వర్యంలో సన్మానం చేశారు. శనివారం కోర్టు ఆవరణంలో న్యాయవాదులు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దంపతులకు శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెట్‌పల్లి న్యాయవాదులు కుటుంబ సభ్యులుగా చూసు కోని కేసుల పరిష్కారానికి సహకరించారన్నారు. లింబాద్రి మాట్లాడుతూ ఇన్‌చార్జి ప్రాసిక్యూటర్‌గా ఉన్నన్ని రోజులు విధులు సక్రమంగా నిర్వహించారని, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యక్షుడు రాంబాబు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, స్రవంతి స్వప్న, శేఖర్, దయాకర్‌వర్మ, రామ్‌రెడ్డి, పాల్గొన్నారు.

సిరికొండలో యువకుడి అదృశ్యం

కథలాపూర్, జూలై 27 : మండలంలోని సిరికొండకు చెందిన మద్దివేని తిరుమలేశ్ (19) అనే యువకుడు అదృశ్యమైనట్టు ఎస్సై జి. నవీన్ తెలిపారు. తిరుమలేశ్ శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగి రాలేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

సీజ్ చేసిన మద్యం బాటిళ్ల ధ్వంసం



మద్యం బాటిళ్లను జగిత్యాల డీఎస్పీ ఆధ్వర్యంలో ధ్వంసం చేస్తున్న పోలీసులు

ధర్మపురి, జూలై 27: ధర్మపురి పట్టణంలో ఎన్నికల్లో సీజ్ చేసిన మద్యం బాటిళ్లను జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం ధ్వంసం చేశారు. ఎస్పీ అశోక్‌కుమార్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ ఆదేశాల మేరకు మద్యం బాటిళ్ల రోడ్ రోలర్‌తో ధ్వంసం చేయించారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వివిధ సందర్భాల్లో ధర్మపురి, వెల్గటూర్, గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 108 కేసుల్లో సుమారు 6 లక్షల విలువ గల 2019.57 లీటర్ల మద్యం బాటిళ్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ మహేందర్‌సింగ్, ఎస్ఐలు ఉదయ్‌కుమార్, ఉమాసాగర్, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుమందు చల్లి.. బంగారం ఎత్తుకెళ్లిన దుండగులు..

25గ్రాముల బంగారం, 20వేల నగదు అపహరణ

రాయికల్, జూలై 27 : ఇంట్లో శుభకార్యం ఉంది, బంగారం కావాలంటూ బంగారం దుకాణానికి వచ్చిన దుండగులు దుకాణ యజమానిపై మత్తుమందు చల్లి 2.5 తులాల బంగారం, నగదును ఎత్తుకెళ్లిన సంఘటన రాయికల్ పట్టణంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలకు ప్రకారం రాయికల్ పట్టణంలోని ఇటిక్యాల క్రాసింగ్ వద్ద గల శ్రీ లక్ష్మీనరసింహ జువెలర్స్ దుకాణానికి శనివారం సాయంత్రం బంగారం కొనడానికి ఇద్దరు వ్యక్తులు వచ్చారు. తమ ఇంట్లో శుభకార్యం ఉంది గురియ బంగారం కావాలంటూ షాపు యజమాని ప్రసాద్‌ను మాటల్లో పెట్టి, బంగారం ఇస్తుండగా అతనిపై దుండగులు మత్తు మందు చల్లి చేసి దుకాణంలోని 2.5 తులాల బంగారం, 15 వేల నగదును ఎత్తుకెళ్లారు. షాపు యజమాని 20 నిమిషాల తర్వాత తేరుకొని చూడగా దుకాణంలో బంగారాన్ని నగదును ఎత్తుకుపోయినట్టు గుర్తించాడు. స్థానిక పోలీస్ స్టేషన్లో బాధితులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్

మెట్‌పల్లి, జూలై, 27 : ప్రభుత్వ అందిస్తున్న శ్రీనిధి రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ అన్నారు. శనివారం మెట్‌పల్లి పురపాలక కార్యాలయంలో మెప్మా ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులకు మహిళా శక్తి పథకాలపై అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మహిళా శక్తి పథకాలు, మహిళా అభిరుచి చేయూతతో మహిళ క్యాంటీన్ నిర్వహించడానికి శ్రీనిధి లింకేజీ బ్యాంకు ద్వారా రూ. 2.20కోట్ల నిధులు మున్సిపాలిటీకి కేటాయించామన్నారు. దీనిని ఉపయోగించుకోవడానికి మహిళా గ్రూపులలోని సభ్యులు ముందుకు వచ్చి ఉపాధి పొందలన్నారు. ఫుడ్ క్యాంటీన్స్, మకట్కులు, ప్యాలాలు తయారు చేసే చిన్నతరహ పరిశ్రమలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో పంపిణీ చేసే స్కూల్ డ్రెస్సులు స్టిచింగ్ చేసుట, ప్రభుత్వ ఆస్పత్రిలో ఫుడ్ క్యాంటీన్‌లు వంటి నిర్వహణాలకు రుణాలు పొందే సౌకర్యం ఉందన్నారు. ఈ పథకం ద్వారా మహిళలు లబ్ధి పొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. సభ్యులకు రెండు లక్ష బీమా సౌకర్యం ఉంటుందని, ప్రమాదానికి గురైన వారికి శ్రీనిధి ద్వారా రూ. 10లక్షలు వడ్డీ లేని రుణాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఏవో శ్రీనివాస్‌గౌడ్, డీఎంసీ సునీత, టీఎంసీ సోమిడి శివ, ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్‌పెక్టర్ రత్నాకర్, సీవో జ్యోతి, ఆర్పీలు, మహిళ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మోహన్

సంక్షిప్తం సమాచారం

కథలాపూర్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేస్తున్న నేపథ్యంలో కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

● మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాలలు, హాస్టళ్ళను శనివారం సాయంత్రం ఎంపీడీవో శంకర్ పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ తీరు తెన్నులను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించిన నేపథ్యంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిస్థితిని జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లకు నివేదించి నట్టు ఎంపీడీవో తెలిపారు. నిధులు అధికంగా అవసరం కానున్న క్రమంలో గ్రామపంచాయతీ నుంచి మరమ్మతులు చేయడానికి అవకాశం లేదని చెప్పారు.

ధర్మపురి: ధర్మపురి మున్సిపల్ వార్డు ఆఫీసర్స్ సమావేశం శనివారం నిర్వహించారు. మొదటి సారిగా ఖమ్మం జిల్లాకు చెందిన మున్సిపల్ వార్డు ఆఫీసర్ యాకయ్య ఆకస్మికంగా మృతి చెందగా ఆయన ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మున్సిపల్ వార్డు ఆఫీసర్స్ అధ్యక్షులుగా డి. లక్ష్మినారాయణ, ఉపాధ్యక్షులుగా కాశెట్టి ప్రమీల, రెంటం వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా నల్ల అంజలి, మద్దెల మల్లేశం, సలహాదా రులుగా ముక్క రజిత, పొట్ట నర్సయ్య, పిల్లి నర్సయ్య, ఇనుగుర్తి లావణ్య ఎన్నుకున్నారు. అలాగే ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కలమడుగు స్వప్న, విడనాల విజయలక్ష్మి, గందం ప్రసాద్, బొమ్మకంటి రమ్యశ్రీ, భాస్కర్‌ను ఎన్నుకున్నారు.

●ధర్మపురి పట్టణంలోని 11 వ వార్డులో కోతుల బారి నుండి కాపాడాలని కోరుతూ అంబటి లక్ష్మన్ మరో 15 మంది వ్యక్తులు మున్సిపల్ మేనేజర్ గంగాధర్‌కు శనివారం వినతి పత్రాన్ని సమర్పించారు. వార్డులో గల ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగి కోతులకు నిలయంగా మారినాయని పేర్కొన్నారు. ఇటీవల ఒక మహిళ పైన దాడి చేసి కోతులు తీవ్రంగా గాయపరచినట్లు తెలిపారు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా కోతుల బారి నుండి రక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మెట్‌పల్లి రూరల్ : వర్షాలు కురుస్తున్న సీజనల్ వ్యాధులు వ్యాప్తి ప్రబలకుండా ప్రజలు ఇంటితో పాటు పరసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి నిజాముద్దీన్ అన్నారు. శనివారం మండలంలోని ఆత్మనగర్ గ్రామంలో డ్రైడేలో భాగంగా మురికి కాలువలు, ఇండ్ల మధ్య బ్లీచింగ్ చేయించారు.

మల్లాపూర్ : పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం అవుతాయని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని వివిధ పాఠశాలలోని ఉపాధ్యాయులకు సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. .

కొడిమ్యాల : స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ కార్యకర్తలు సిద్ధం కావాలని బీజేపీ మండల అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బీజేపీ నాయకులు చల్ల శ్రీనివాస రెడ్డి, రాజేశం, బుచ్చిరాములు, అరుణ్, తిరుపతిరెడ్డి, అంజయ్య, నరేష్, రాజు, సాయిబాబా, శంకర్ ఉన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో శనివారం బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలు ఎత్తుకున్నారు.

జగిత్యాల అర్బన్ : జగిత్యాల పట్టణ భజరంగ్‌దళ్ వివిధ విభాగాల కమిటీల నియామకాలు చేపట్టినట్లు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్, సంతోష్ తెలిపారు. జగిత్యాల సహసంయోజక్‌గా విశ్వనాథ్, విద్యార్థి ప్రముఖ్ విఘ్నేష్, గోరక్ష ప్రముఖ్ కృష్ణ, సురక్ష ప్రముఖ్ దత్తాత్రేయ, సేవా ప్రముఖ్ రాజ్‌వివేక్, సోషల్ మీడియా విభాగం విష్ణువర్ధన్‌లను నియమించినట్లు తెలిపారు.

జగిత్యాల: వయోవృద్ధులైన కన్న తల్లి దండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత పిల్లలదేనని, ఎవరైనా విస్మరిస్తే జైలుకు వెళ్లాల్సి వస్తుందని చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి తఫజుల్ హుస్సైన్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం కింద దాఖలు అయిన కేసులను విచారణలు జరిపి సాక్షాధారాలను పరిశీలించారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల అర్బన్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గత ఐదేళ్లపాటు జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి మల్యాలకు బదిలీపై వెళ్తున్న శ్రీనివాస్‌రెడ్డిని మండలపరిషత్ ఉద్యోగులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మండలానికి అందించిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మీ, ఎంపీడీవో విజయలక్ష్మీ, ఎంపీవో సలీం, ఏపీవో దయాకర్, పంచాయితీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యా యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినపల్లి ఆనంద్‌రావు అన్నారు. శనివారం ఆయన సభ్యత్వ నమోదులో భాగంగా మండలంలోని డబ్బా, వర్షకొండ, గోధూర్, తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో, ఇబ్రహీంపట్నం కేజీబీవీ పాఠశాలలో సభ్యత్వ నమోదు చేయించారు.